
సాక్షి ఒడిశా

సోమవారం । 27 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,60,726లు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



సార్వత్రిక విజయమే లక్ష్యం - 8లో



అనుమానాస్పద రీతిలో యువతి మృతి - 8లో

న్యూస్‌రీల్

పాడుగు కోవెలలో గీతా పారాయణం



అలయంలో సామూహిక గీతా పారాయణం చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలోని పాడుగు కోవెలలో(రామలింగేశ్వర ఆలయం) శ్రీలలితా అమ్మవారి సమక్షంలో వసంత నవరాత్రుల సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, మహిళలు గీతా పారాయణం, ఆదిత్య హృదయం, శ్రీరామ రక్షస్తోత్రం ఆదివారం పఠించారు. అనంతరం సెంచూరియన్ వర్సిటీ అధ్యాపకులు వినయ్ భాగవత ప్రవచాలను వినిపించారు. కార్యక్రమంలో లలితాదేవి మందిరం అర్చకులు దుర్గాప్రసాద్ దాస్, విశాలాక్షి అయ్యంగార్ పర్యవేక్షించారు.

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట



పట్టుబడిన కలప వ్యాన్‌తో డ్రైవర్

జయపురం: పర్మిట్ లేకుండా విలువైన కలపను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను జయపురం సదర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి డ్రైవర్ పంపుణీ గ్రామానికి చెందిన ఆనంద బిశ్వాల్(48)ను అరెస్ట్ చేశామని సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం సబ్ ఇన్‌స్పెక్టర్ రాజకిశోర్ బారిక్ సిబ్బందితో కలిసి పంపుణీ ప్రాంతంలో శనివారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. జయనగర్ సమీపంలోని భూతనాథ్ మందిరం వద్ద వాహన తనిఖీ చేస్తుండగా జయపురం వైపు వ్యాన్‌తో అతి వేగంగా వస్తున్న డ్రైవర్.. పోలీసులను చూసి వాహనాన్ని వదిలి, సమీపంలోని అడవిలోకి పరుగు తీశాడు. అనుమానంతో పోలీసులు అతనిని వెంబడించి, పట్టుకున్నారని. ఈ మేరకు వాహనాన్ని తనిఖీ చేయగా, వివిధ సైజులలో 70విలువైన గుగ్గిలం చెక్కలు ఉన్నట్లు గుర్తించారు. రవాణాకు సంబంధించి అతని వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో కలపను స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ను అరెస్ట్ చేశామని వివరించారు.

552 కిలోల గంజాయి స్వాధీనం



వ్యాన్‌లో పట్టుబడిన గంజాయి

జయపురం: ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించేందుకు భద్రపరిచిన గంజాయిని బొయిపరిగుడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనలో ఎవరూ పట్టుబడలేదని పోలీసు అధికారి అశ్వినీకుమార్ పట్నాయక్ ఆదివారం తెలిపారు. బొయిపరిగుడ సమితి కాత్రగుడ గ్రామం సమీపంలోని నీలగిరి తోటలో వ్యాన్‌లో గంజాయి బస్తాలు ఉన్నట్లు శనివారం సాయంత్రం విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది. వెంటనే ప్రత్యేక పోలీసు బృందం గ్రామానికి చేరుకొని, వాహనంలోని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిని మేజిస్ట్రేట్ సమక్షంలో తూకం వేయగా.. 552 కిలోలు ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన సరుకు విలువ రూ.55 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. అయితే దీనిని ఎవరు? అక్కడి నుంచి ఎక్కడికి రవాణా చేసేందుకు సిద్ధమయ్యారనే విషయాలపై సమాచారం లేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్‌పీఎఫ్ జనసంపర్క శిబిరం



జనసంపర్క శిబిరంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో సీఆర్‌పీఎఫ్ నాలుగో బెటాలియన్ ఆధ్వర్యంలో జనసంపర్క శిబిరం ఆదివారం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డి.కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, అప్పుడే శాంతి భద్రతలు మెరుగ్గాంటాయని సూచించారు. అనంతరం గ్రామస్తులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యులు బరాటం వరప్రసాదరావు, కల్యాణ సింగుపూర్ ఏఎస్‌ఐ అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ ప్రకాషరావు సతీమణికి తెలుగు తేజం పురస్కారం అందిస్తున్న గవర్నర్ గణేషీలాల్

- అంతా ఒక్కటనే భావనతోనే ఇది సాధ్యం
- 'ఐక్యత' రజతోత్సవ వేడుకలో గవర్నర్ గణేషీలాల్
- పాల్గొన్న రాతెస, తెలుగు సంఘాల ప్రతినిధులు

ఏకత్వానికి పునాది.. ప్రేమ

భువనేశ్వర్: 'భిన్నత్వంలో ఏకత్వ భావాలను ప్రేరేపించేంది నిష్కల్మష ప్రేమ. అంకిత భావంతో మాత్రమే ఇది సాధ్యం అవుతుంద'ని రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ సూచించారు. కటక్‌లోని ఐక్యత సంస్థ రజతోత్సవ వేడుకలకు ఆయన ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... ఒంటరి పోరాటంలో ఆరాటం తొలగించేది సమైక్యతని తెలిపారు. ఐక్య భావాలతో నిరంతరం కృషి చేసి, భావి తరాల్లో ఏకత్వ భావాల పట్ల అవగాహన కల్పించడంలో సాంఘిక, సాంస్కృతిక, సేవాసంస్థల పాత్ర అనన్యమని ఉద్ఘాటించారు. భాషలు వేరైనా.. భావాలు ఒకటి కావడంతో పరిసరాలు, తోటి వ్యక్తులతో కలిసి మెలిసే ఉన్నత విలువలకు ప్రతీకగా ఐక్యత సంస్థ 25 ఏళ్ల ఉత్సవాన్ని సామూహికంగా జరుపుకోగలుగుతోందని అభినందించారు.



బొమ్మల కొలువు పుస్తకావిష్కరణలో రాష్ట్రేతర తెలుగు సమాఖ్య ప్రతినిధులు

సాహితీ ఆవిష్కరణ..

కార్యక్రమంలో ప్రముఖ రచయితల తెలుగు పుస్తకాలను ఆవిష్కరించారు. ఉత్సవాలు ప్రారంభం పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ గణేషీలాల్ ఐక్యత 25 వసంతాల జ్ఞాపికను తొలుత ఆవిష్కరించారు. కటక్ బలిజాతర మైదానంలో జరిగిన సాంస్కృతిక వేదికపై రాతెస ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఇతర ప్రముఖుల సమక్షంలో అంబళ్ల జనార్దన్ రచించిన బొంబాయి కథలు, జక్కిన గంగాధర్ రచనలో బొమ్మల కొలువు సాహిత్య విలువలుతో కూడిన తెలుగు పుస్తకాలను రాతెస అధ్యక్షుడు సుందరరావు ఆవిష్కరించి, అభినందించారు.

ఒక్కటై సాగుదాం..

ఐక్యత 25వ వసంతోత్సవానికి రాష్ట్రేతర తెలుగు సమాఖ్య(రాతెస) చేయూతగా నిలిచింది. సుదీర్ఘ అనుభవాన్ని కూడగట్టుకుని ప్రాంతీయగా పరిమితమైన ఐక్యత సంస్థ ఉత్సవాలను జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు సహకారం అందించింది. ఈ సందర్భంగా కటక్ మహా నగరంలో జాతీయ సాంస్కృతిక ఉత్సవం నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. విశ్వమంతా విస్తరించిన తెలుగు సాహితీ, సాంస్కృతిక, సంప్రదాయ విలువలను మారుమూల ప్రాంతాల్లో సభాముఖంగా ప్రదర్శించి వర్ధమాన తరాలను ముందుకు నడిపించే లక్ష్యంతో ఐక్యత రజతోత్సవాల్లో పాలుపంచుకున్నట్లు రాతెస వ్యవస్థాపక అధ్యక్షుడు రాళ్లపల్లి సుందరరావు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి సాహితీవేత్తలు, నృత్య, సంగీత, నటన కళాకారులు పెద్ద సంఖ్యలో విచ్చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కోలాటం, లఘు హాస్యనాటిక, జానపద నృత్యాలు, మిమిక్రీ ఇతరేతర పలు కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.



న్యూఢిల్లీ రాతెస బృందం నృత్య ప్రదర్శన

తెలుగు తేజాలకు సత్కారం..

ఐక్యత రజతోత్సవ వేదికపై క్రీడలు, మానవీయత, సౌజన్యత రంగాల్లో విశిష్టత చాటుకున్న తెలుగు ప్రముఖులను గవర్నర్ గణేషీలాల్ ప్రత్యేకంగా సత్కరించారు. మానవీయ విలువల పరిరక్షణ వర్గంలో దివంగత పద్మశ్రీ డి.ప్రకాషరావు కుటుంబీకులకు, క్రీడారంగంలో జాతీయ స్థాయిలో ప్రతిభ ప్రదర్శిస్తున్న రోషిణి, సౌజన్యతకు మారుపేరుగా నిలిచిన నందమూరి రమణనాయుడు లను సన్మానించి, ప్రోత్సహించారు. కార్యక్రమాలకు రాజకీయ, ప్రభుత్వ, న్యాయ వర్గాల నుంచి పలువురు ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు.

తీరని ఆవేదన..

- మంచంపైనే గర్భిణిని 2కిలోమీటర్లు మోసుకువెళ్లిన కుటుంబ సభ్యులు

జయపురం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా, కొరాపుట్ జిల్లాలో నేటికీ అనేక గ్రామాలకు కనీస రహదారులు లేకపోవడంతో గ్రామీణులు అగచాట్లు పడుతున్నారు. మారుమూల గ్రామాలు, పర్వత ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు పరిస్థితి మరింత శోచనీయంగా ఉంది. ఈ విషయాన్ని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి శాసనసభలో ప్రస్తావించిన మరుసటి రోజే జయపురం సమితి రామగడ గ్రామంలో విచారకర ఘటన చోటు చేసుకుంది. పురిటి నొప్పులతో బాధ పడుతున్న మహిళను.. మంచంపై మోసుకుంటూ ఆస్పత్రికి తీసుకు వెళ్లిన ఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... సబ్ డివిజన్ పరిధిలోని రామగడ గ్రామానికి చెందిన డుబ బొడొభాయి భార్య జమున పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు కుములిపుట్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానకి తీసుకు వెళ్లాలని నిర్ణయించారు. 108 అంబులెన్స్‌లకు సమాచారం అందించగా, రోడ్డు లేకపోవడంతో అక్కడికి చేరుకోలేమని సిబ్బంది స్పష్టంచేశారు. దీంతో బాధితురాలిని మంచంపై కూర్చోబెట్టిన కుటుంబ సభ్యులు.. రాళ్లు, గుట్టలు దాటుకుంటూ 2కిలోమీటర్ల దూరంలోని భైరాగిమఠం గ్రామానికి చేర్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో ఆమెను కుములిపుట్ ఆస్పత్రికి చేర్చగా, మగ బిడ్డకు జన్మనిచ్చింది. సకాలంలో చేర్చడంతో తల్లీ, బిడ్డలకు ఎటువంటి హానీ లేదని వైద్యులు తెలపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే గ్రామంలో ఎవరికి ప్రాణాపాయం వచ్చినా ఇదే పరిస్థితి ఎదురవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. రహదారితో పాటు విద్యుత్, కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



కొండ మార్గంలో మంచంపై గర్భిణిని మోసుకు వెళ్తున్న దృశ్యం

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరంలో ఎంపీ శేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా

- ఎంపీ చంద్రశేఖర్ సాహు

బరంపురం: అంతా రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు పిలుపునిచ్చారు. నగరంలోని కలాసి వీధి ఉన్న బీఎంసీ కమ్యూనిటీ భవనంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్ 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని ఎంపీతో పాటు ఎమ్మెల్యే విక్రమ్ పండా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దుర్ఘటనల సమయాల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా మరిన్ని శిబిరాలు నిర్వహించి, అపాయంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం రక్తదాతలను ఎంపీ, ఎమ్మెల్యే అభినందించారు. శిబిరంలో క్లబ్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విశ్వాసం చూపిన శునకం

మల్కన్‌గిరి:

యజమాని ఇంట్లోకి ప్రవేశించిన విషసర్పాన్ని తన ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా హతమార్చింది ఓ పెంపుడు శునకం. జిల్లా కేంద్రంలోని శివమందిర్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంద. శివప్రసాద్ మాఝి అనే వ్యక్తి ఇంట్లోకి శనివారం రాత్రి పాము ప్రవేశించింది. గమనించిన అదే ఇంట్లోని పెంపుడు శునకం.. ఒక్కసారిగా సర్పంపై దాడి చేసింది. యజమాని కుటుంబాన్ని కాపడాలనే ప్రయత్నంలో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పామును కొరికి, చంపింది. ఇంతలో శివప్రసాద్ స్థానిక స్నేక్ హెల్ప్‌లైన్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చేన కొద్ది సేపటికే సర్పం కొన ఊపిరితో చనిపోయింది. మృతిచెందిన పామును హెల్ప్‌లైన్ సిబ్బంది తమ వెంట తీసుకు వెళ్లారు. మరోవైపు శునకం సాహసాన్ని స్థానికులు ప్రశంసించారు.



శునకం హతమార్చిన సర్పం

జిల్లాలకు ఎల్లో వార్నింగ్

భువనేశ్వర్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ విభాగం కేంద్రం ఆదివారం ప్రకటించింది. రాష్ట్రంలో ప్రధానంగా 13 జిల్లాల్లో సోమవారం ఉదయం 8.30 గంటల వరకు ఈ వాతావరణం నెలకొంటుందని సమాచారం. ఈ వ్యవధిలో ఉపరితల గాలులు గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని సమాచారం జారీ చేసింది. కెంజొహార్, మయూర్‌భంజ్, జాజ్‌పూర్, బాలాసోర్, భద్రక్, అంగుల్, ఢెంకనాల్, రాయగడ, కంధమల్, గంజాం, గజపతి, నయాగఢ్, ఖుర్దా జిల్లాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఎల్లో వార్నింగ్ కూడా జారీ చేశారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో ఈ వాతావరణం ప్రభావం ఉంటుందని వివరించింది.

కాత్యాయనిగా జగులైమాత

భువనేశ్వర్: ఖుర్దారోడ్ కుదియారి గ్రామదేవత జగులై కాత్యాయని స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వసంత నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం గ్రామ దేవతను కాత్యాయని అలంకారంతో తీర్చిదిద్దారు. ఉత్సవాదుల్లో భాగంగా సంధ్యావేళలో మహాస్నానం పూర్తి చేసి, అమ్మవారికి ఈ అలంకరణ చేశారు. నవరాత్రి ఉత్సవాదుల్లో భాగంగా చండీ పారాయణం, షోడశోపచార పూజాదులు నిర్వహించారు.



కుదియారి గ్రామదేవత జగులైమాత కాత్యాయని స్వరూపం

పాతకక్షలతో ఇరువర్గాల కాల్పులు



ఎంకేసీజీలో చికిత్స పొందుతున్న నిరంజన్ మహరాణా

- యువకుడికి తీవ్ర గాయాలు.. ఎంకేసీజీకి తరలింపు

బరంపురం: గంజాం జిల్లా పురుసోత్తంపూర్ పోలీసు స్టేషన్ పరిధి సికులియా గ్రామంలో పాతకక్షల కేంద్రంగా ఇరువర్గాలు తుపాకీతో కాల్పుల, కత్తులతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో యువకుడికి తీవ్ర గాయలయ్యాయి. ఐఐసీ అధికారి చిత్రరంజన్ బెహరా తెలిపిన వివరాల ప్రకారం పురుసోత్తంపూర్ బ్లాక్ సికురియా గ్రామంలో గత కొద్ది రోజులుగా ఇరువర్గాల మధ్య రాజుకుంటున్న వివాదం తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఒకరిపై ఒకరు కత్తులు, తుపాకీ కాల్పులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో అదే గ్రామానికి నిరంజన్ మహరాణాకు తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు వెంటనే ఎంకేసీజీ బోధనాస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. దీనిపై సమాచారం అందుకున్న పురుసోత్తంపూర్ పోలీసులు గ్రామానికి చేరుకొని, కేసు నమోదు చేయడంతో పాటు దర్యాప్తు చేస్తున్నారు.

టాటా పవర్ బృందంపై గ్రామస్తుల దాడి

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో నువాపాడ గ్రామస్తులు టాటా పవర్ స్క్వాడ్ బృందంపై దాడి చేశారు. ఇందులో ముగ్గురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా, చందిలి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... టాటా పవర్ స్క్వాడ్ బృందానికి చెందిన లైన్‌మన్ చిత్రసేన్ లెంక, ఉద్యోగి విశ్వనాథ్ రాజ్‌గురు, అసిస్టెంట్ జేఈ మహేంద్ర పొరిడ తనిఖీల నిమిత్తం నువాపాడ గ్రామానికి వెళ్లారు. బకాయి పడిన విద్యుత్ వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేసేందుకు సమాయత్తమయ్యారు. ఈ క్రమంలో కొంతమంది విద్యుత్ స్తంభాల నుంచి అక్రమంగా వినియోగానికి పాల్పడటాన్ని గమనించిన సిబ్బంది.. అటువంటి వాటిని తొలగించి, తిరిగి జేకే పూర్‌లోని సెక్షన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు అక్కడికి చేరుకొని, సిబ్బందిపై దాడికి దిగారు. ఇందులో విశ్వనాథ్ రాజ్‌గురుకు తీవ్రగాయాలు కావడంతో మిగతా వారు చికిత్స నిమిత్తం వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి చికిత్సకి తరలించారు. ఘటనపై చందిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దాడులకు పాల్పడిన వారి కోసం గాలిస్తున్నారు.



దాడిలో గాయపడిన టాటా సిబ్బంది రాజ్‌గురు

నోటికి తాళాలతో నిరసనలు

- రాహుల్‌గాంధీపై కేంద్రం చర్యలను విమర్శించిన ఎమ్మెల్యే తారాప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

జయపురం: దేశంలో ప్రజాస్వామ్య హంతకుడు ప్రధాని నరేంద్రమోదీ అని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు, ఎంపీ రాహుల్‌గాంధీపై అనర్హత వేయడాన్ని నిరసిస్తూ జయపురం వద్ద పార్టీ శ్రేణులు ఆదివారం ధర్నా చేపట్టారు. డీసీసీ అధ్యక్షురాలు మీనాక్షీ బాహినీపతి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నోటికి మాస్క్‌తో పాటు తాళాలు వేసుకొని, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీ ఇటీవల చేపట్టిన భారత్ జోడో యాత్రకు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి లభించిన ఆదరణ చూసి ఓర్వలేకే బీజేపీ దిగజారుడు చర్యలకు దిగిందన్నారు. అంతేకాకుండా పార్లమెంట్‌లో అధికార పార్టీని కుదిపేస్తున్న అదానీ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకే పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని మండిపడ్డారు. దేశంలో బీజేపీ అక్రమాలకు చెక్ పెట్టి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేంత వరకు కాంగ్రెస్ పోరాటం సాగిస్తుందని ప్రకటించారు. ధర్నాలో మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బినోద్ మహపాత్రో, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుకాంత పట్నాయక్, పొట్టంగి మాజీ ఎమ్మెల్యే రామచంద్ర కడమ్, సీనియర్ నాయకులు బుల్లు సాహు, భీరేన్‌మోహన పట్నాయక్, నిహార బిశాయి, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: గాంధీ జంక్షన్ వద్ద కాంగ్రెస్ సభ్యుల సత్యాగ్రహం

పర్లాకిమిడిలో సత్యాగ్రహం..

పర్లాకిమిడి: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు, రెండేళ్ల జైలు శిక్ష తీర్పును నిరసిస్తూ గజపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ జంక్షన్, గౌరహరి గ్రంథాలయం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాశరథి గమాంగో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ కక్షపూరిత వైఖరిని ఎండగట్టారు. సత్యాగ్రహంలో గుమ్మా బ్లాక్ జిల్లా పరిషత్ సభ్యులు రేణుకా పాత్రో, రాయగడ బ్లాక్‌కు చెందని మొరసవుదా మండల్, మఫెల్ స్వాలసింగి, ఆర్.ఉదయగిరి నుంచి ఫిలిప్ మాలి, అభిమన్యు పండా, బసంత పండా, సూర్యనారాయణ పాత్రో, కున్నా మాఝి, రజపాత్రో తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హడ్డుబంగిలో రక్తదాన శిబిరం



దాతలకు జ్ఞాపిక అందిస్తున్న ట్రస్టు సభ్యులు

పర్లాకిమిడి: కాశీనగర్ బ్లాక్ హడ్డుబంగి గ్రామంలో రక్తదాన శిబిరాన్ని భగత్‌సింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి సహకారంలో ఆదివారం నిర్వహించారు. ఇందులో 58మంది దాతలు పాల్గొని రక్తందానం చేశారు. ట్రస్టు ఏర్పడిన 18నెలల్లో 5సార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, 324 యూనిట్ల రక్తాన్ని సేకరించామని ట్రస్టు ప్రతినిధి నడిమింది జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు జ్ఞాపికలను అందజేసి, అభినందించారు. శిబిరంలో ట్రస్టు సభ్యులు ఇసై శివ, జెమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి



రైలు ఢీకొని మృతిచెందిన యశ్వంత్

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ రైల్వే గేటు సమీపంలో ఆదివారం విశాఖ ఎక్స్‌ప్రెస్ కొని రావివలస పంచాయతీ పరిధి చిన్నానారాయణపురం గ్రామానికి చెందిన మురపాల యశ్వంత్(18) అనే యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన యశ్వంత్ ఆదివారం మధ్యాహ్నం సమయంలో నౌపడ రైల్వేగేటుకు కూతవేటు దూరంలో ట్రాక్ దాటుతుండగా అదే సమయంలో అటుగా వచ్చిన విశాఖ వైపు వెలుతున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పలాస జీఆర్పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించనున్నట్లు తెలిపారు. మృతుడికి తండ్రి గవరయ్య, తల్లి అమ్ములమ్మ, అన్నయ్య గణపతి ఉన్నారు. ఇది ప్రమాదమా.. ఆత్మహత్యా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కొట్లాటపై కేసు నమోదు

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో ముగ్గురు వ్యక్తులు గొడవ పడగా.. దీనిపై పోలీసు కేసు నమోదైందని ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపారు. గ్రామానికి చెందిన బస్వ గౌరీశంకర్, దారపు నీలయ్య, తాత అనే వ్యక్తుల మధ్య రహదారి సమస్య నలుగుతోంది. ఏడాదిగా దీనిపై వారు గొడవ పడుతున్నారు. ఆదివారం ముగ్గురి మధ్య మాటలు ముదిరి ఘర్షణ జరిగింది. ఈ గొడవలో గౌరీశంకర్ అనే వ్యక్తి నీలయ్య, తాతలను తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. వీరిని శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

హిరమండలం: జాతీయ స్థాయిలో జరగనున్న కుస్తీ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు టి.సింహాచలం, సోనియా, చామంతి మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ పోటీలకు అర్హత సాధించారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కుక్కలు దాడి చేయడంతో ఒక జింక మృతి చెందింది. ఆదివారం సాయంత్రం జోగి కొండ నుంచి ఇందిరమ్మ కాలనీలోకి చుక్కల జింక రావడంతో కుక్కలు చూసి వెంటాడి దాడిచేశాయి. జింక తీవ్రంగా గాయపడింది. స్థానిక యువకులు వెళ్లి చూసేసరికే చనిపోయింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడకు ఫారెస్ట్ సిబ్బంది చేరుకుని మృతి చెందిన జింకను తమ కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఆదివారం రాత్రి అయిపోవడంతో సోమవారం ఉదయం పోస్టుమార్టం చేసి, అనంతరం అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో దహనం చేస్తామన్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు అప్రజాస్వామికం

శ్రీకాకుళం: ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం సబబు కాదని, అప్రజాస్వామిక విధానాలను తామంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రెల్ల సురేష్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ప్రధాని మోదీ ఇంటి పేరుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న అభియోగం దృష్ట్యా నమోదైన కేసుకు సంబంధించి సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షకు సంబంధించిన ఇంకా ఏ విషయం కొలిక్కి రాక మునుపే, రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

సార్వత్రిక విజయమే లక్ష్యం

- బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్
- భువనేశ్వర్‌లో ఘన స్వాగతం పలికిన కార్యకర్తలు



మన్మోహన్ సామల్‌ను సత్కరిస్తున్న పురంధేశ్వరి, నాయకులు


భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ఇది తథ్యమని బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడి మన్మోహన్ సామల్ జోష్యం చెప్పారు. 23 ఏళ్ల నవీన్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ పాలనతో విసిగిన రాష్ట్రప్రజలు ప్రత్యామ్నాయం కోసం నిరీక్షిస్తున్నారన్నారు. ఆ సమయం ఆసన్నమైందని తెలిపారు. పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన ఆయన.. భువనేశ్వర్ లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి ఆదివారం తొలిసారిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. భద్రక్ నుంచి భువనేశ్వర్ వరకు సాగిన యాత్రలో అడుగడుగునా నీరాజనాలు పలికారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండా, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి డి.పురంధేశ్వరి, ప్రతిపక్ష నాయకుడు(ఎల్‌ఓపీ) జయనారాయణ మిశ్రా, కేంద్ర మాజీమంత్రి ప్రతాప్ షడంగి తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి, బీజేడీని గద్దె దించుతామని ఈ సందర్భంగా అంతా పునరుద్ఘాటించారు. 2024లో లోక్‌సభ తోపాటు ఒడిశాలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యామ్నాయం కోసం నిరీక్షిస్తున్న తరుణంలో దీనిని సద్వినియోగించుకొని, కేంద్రంలో, రాష్ట్రంలో తప్పకుండా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తంచేశారు. తాము అధికారంలోకి రాగానే సంచలనాత్మక మంత్రి నవకిషోర్ దాస్ హత్యకు సంబంధించిన మిస్టరీని ఛేదిస్తామని, వాస్తవాలు బట్టబయలు చేస్తామని ప్రకటించారు.



సామల్‌కు స్వాగతం పలికేందుకు భారీగా తరలివచ్చిన బీజేపీ కార్యకర్తలు

నీరంతా బంగారమాయె!

- బొలంగీర్ జిల్లాలో వింత ఘటన



బోరు నీటిలో తేలిన బంగారు వన్నె రేణువులు

భువనేశ్వర్: బోరు నుంచి బంగారం నీరై ప్రవహిస్తోంది. బొలంగీర్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక స్థలం హరిశంకర్ ప్రాంతంలో ఈ ఘటన పట్ల ప్రజలు సంభ్రమాశ్చర్యాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రచారంతో బొలంగీర్ ప్రాంతం మార్మోగింది. సాగు పనుల కోసం తవ్వించిన బోరు నుంచి వచ్చిన నీరు బంగారు వర్ణంతో తళతళలాడుతోంది. నీటిని వడగడితే బంగారు వన్నె రేణువులు తేలుతున్నాయి. ఖచ్చితంగా ఇది బంగారమేనన్న అభిప్రాయం బలపడి ప్రచారం ఊపందుకుంది. స్థానిక ప్రభుత్వ పాలన అధికారులు ఘటనా స్థలం చేరి, పూర్వాపరాలు ఆరా తీస్తున్నారు. బొలంగీర్ జిల్లా ఖప్రాఖోల్ మండలం నందుపల్ల పంచాయతీ చంచబహలి గ్రామంలో భూగర్భ జలం నుంచి బంగారం పొంగి పొర్లుతోందని గ్రామంలో ప్రారంభమైన చర్చ సర్వత్రా సంచలనం రేపుతోంది. చంచబహలి గ్రామంలో ఉంటున్న మహ్మద్ జావేద్ దేవర్ తన స్థలంలో నెల రోజుల క్రితం గొట్టపు బావిని తవ్వించాడు. ఈనెల 18న బావికి మోటారు పంపు అమర్చాడు. తొలిసారిగా ఈనెల 21న పంపు సాయంతో నీళ్లు తీశాడు. తొలుత స్వచ్ఛమైన నీరు బయటకు వచ్చింది. క్రమంగా మురుగునీరు, తదుపరి పసుపురంగు నీరు బయటకు రావడం ఆరంభమైంది. ఈ నీటిని గుడ్డతో వడగట్టడంతో పసుపు నీటిలో బంగారు వన్నె ధాతు కణికలు తెలినట్లు గుర్తించాడు. ఈ సంగతి ఊరంతా గుప్పుమనడంతో ఖప్రాఖోల్ తహసీల్దార్ ఆదిత్యమిశ్రా, సమితి అభివృద్ధి అధికారి(బీడీఓ) రష్మిరంజన్ రౌత్, పోలీసు ఠాణా అధికారి రమాకాంత్ సాహు ఘటనా స్థలం సందర్శించారు. గొట్టపు బావి నుంచి బయట పడుతున్న బంగారు వన్నె ధాతు కణికల పరీక్షల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

కంటైనర్‌లో 480కిలోల గంజాయి



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సమీపంలోని చంపకారి గ్రామం వద్ద ఉన్న చెక్‌పోస్టులో వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు భారీగా గంజాయి నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న సరుకును స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఇరువురినీ సోమవారం ఉదయం కోర్టులో హాజరు పరుస్తామని మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో తెలిపారు. పట్టుబడిన గంజాయి 480 కిలోలు ఉందని, దీని విలువ రూ.60 లక్షలు ఉంటుందని ప్రకటించారు.

కారు ఢీకొని ఇద్దరి మృతి



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పోతాఖల్ గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. కలిమెల నుంచి మల్కన్‌గిరి వస్తున్న కారును.. అటుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో బైక్‌పై ఉన్న గంగా కవాసి(26), లచ్చ మాఢి(29) అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కలిమెల పోలీసులు అక్కడికి చేరుకొని, కేసు నమోదు చేయడంతో పాటు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. కారు డ్రైవర్ పరారవ్వడంతో అతని కోసం గాలిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతులు ఏరగొండ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు.

పట్టుబడిన దోపిడీ దొంగలు

- రూ.80 వేల నగదు, 15 గ్రాముల బంగారం రికవరీ



పోలీసుల అదుపులో నిందితులు, రికవరీ చేసిన సొత్తు

బరంపురం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన దోపిడీలకు సంబంధించి పోలీసులు ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్ట్ చేశారు. బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం... నిమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధిలోని 4 ప్రాంతాల్లో జరిగిన దోపిడీలు, గోపాల్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధి నారాయణపూర్ గ్రామంలో జరిగిన దోపిడీ ఘటనలకు సబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో ముగ్గురు అనుమానితులను అరెస్ట్ చేసి, విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయి. ఈ క్రమంలో వారి నుంచి రూ.80 వేల నగదు, 15 గ్రాముల బంగారం, 3 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా పలాస బృందావన్ కాలనీకి చెందిన పి.కృష్ణ, బరంపురం లోని గణేష్‌నగర్‌కు చెందిన సాగర్ ముదిలి, నారాయణపూర్ గ్రామానికి చెందిన శ్రీధర్ బెహరాగా గుర్తించామని ఎస్పీ వివరించారు.

'ఒడియా బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢి

కంచిలి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో గల ప్రభుత్వ ఒడియా పాఠశాలల్లో రానున్న విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలని ఏపీ ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢి పిలుపునిచ్చారు. కంచిలి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సత్యనారాయణ పాఢి అధ్యక్షతన ఉత్కళ సమ్మిళినీ విద్యా వలంటీర్ల సమావేశం ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒడియా భాష సాహిత్యం, సంస్కృతి వికాసానికి ఉత్తరాంధ్ర జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఒడిశా ప్రభుత్వం నియమించిన విద్యావలంటీర్లను ఉద్దేశించి సత్యనారాయణపాఢి మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో గల 120 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 32 ఉన్నత ఒడియా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయ పోస్టుల స్థానంలో 130 మంది విద్యావలంటీర్లు పనిచేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వ, గిరిజన పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనార్యాణను కలిసి మాట్లాడుతామని తెలిపారు. విద్యావలంటీర్ల జీతాల మంజూరు కోసం ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌధురీ మాట్లాడుతూ విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్ హోమ్ వర్క్స్ ప్రతిరోజూ సరిదిద్దాలని, పాఠ్య ప్రణాళిక, టీచర్స్ డైరీ రాయాలని, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో విద్యా బోధన చేయాలని సూచించారు.

1న వీరగున్నమ్మ వర్ధంతి సభ



వీరగున్నమ్మ వర్ధంతి సభ కరపత్రా లను విడుదల చేస్తున్న దృశ్యం

మందస: బ్రిటీష్ పాలకులపై కత్తి దూసిన వీర గున్నమ్మ వర్ధంతిని ఏప్రిల్ 1న మందస బస్టాండ్‌లో నిర్వహిస్తున్నట్టు రైతు సంఘం, సీఐటీయూ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు మందస పట్టణంలో ఆదివారం వీరగున్నమ్మ వర్ధంతి సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో మందస బస్టాండ్‌లో బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎంపీ మధుతో పాటు ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. ఇదే మండలంలోని వీరగున్నమ్మపురం గ్రామానికి చెందిన శాసుమాన గున్నమ్మ.. బ్రిటిష్ తూటాలకు బలై 83 ఏళ్లు కావస్తోందన్నారు. వీరగున్నమ్మ వర్ధంతి సభను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు, మట్ట ధర్మారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సీఐటీయూ నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, కె.కేశవరావు, ఎస్.వల్లభరావు, సీహెచ్ గణేశ్, గిరిజన సంఘం నాయకులు ఎస్.గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద రీతిలో యువతి మృతి



యువతి మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- దేవగిరి కొలనులో మృతదేహం లభ్యం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో ప్రముఖ శైవక్షేత్రం దేవగిరి కొండపై ఉన్న కొలనులో అనుమానాస్పద రీతిలో యువతి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు కాసీపూర్ సమితి సుంగేరు గ్రామానికి చెందిన దేవకి గౌడొ(18)గా గుర్తించారు. దీనిపై ఐఐసీ ముకుందదేవ్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుంగేరు గ్రామానికి చెందిన దేవకితో పాటు మరో ముగ్గురు యువతులు కల్యాణ సింగుపూర్ లోని దేవగిరి మహావిద్యాలయంలో ప్లస్-త్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ముగ్గురూ స్థానికంగా అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో ఏదో పనిమీద ఈనెల 22న దేవకి తన తోటి స్నేహితులకు చెప్పి, బయటకు వెళ్లింది. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో వారంతా పరిసరాలను గాలించారు. గురువారం దేవగిరి కొండపైకి వెళ్లి అన్ని దిశలా వెతికారు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేశారు. అంతా కలిసి ఆదివారం సాయంత్రం దేవగిరి కొండపైకి వెళ్లి వెతకగా, దేవకీకి చెందిన కాలి చెప్పు కనిపించింది. దీంతో ఆందోళన చెందిన వారంతా.. కొండపై ఉన్న కొలనులో చూడగా యువతి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. దీనిపై కల్యాణ సింగుపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు.. అగ్నిమాపక సిబ్బంది సాయంతో యువతి శవాన్ని బయటకు తీశారు. యువతి శరీరానికి పెద్ద బండరాయి కట్టి ఉండటంతో మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది హత్యా? లేక ఆత్మహత్య అనే విషయంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



దేవకి గౌడొ(ఫైల్)

సందడిగా ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న న్యాయవాదులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో శనివారం ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఆదివారం ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక బార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు లంబోదర్ తూరక్, ఉపాధ్యక్షుడు జోషఫ్ జేమ్స్, కార్యదర్శులు నర్సింగ్‌చరణ్ మహంతి, భమితేస్ బిశ్వాస్, సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. వీరంతా సోమవారం నుంచి విధుల్లో పాల్గొంటారని అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం కోర్టు ఆవరణలో వేడుకలు నిర్వహించారు.

పనస పసందు

పనస రైతుల పంట పండింది. పనస కాయలు గుత్తులు గుత్తులుగా కాయడంతో పాటు మంచి ధర కూడా లభిస్తోంది. ఉద్దానం గోపినాథపురంలోని రైతు కర్ని వల్లయ్య కొబ్బరితోటలో అంతర పంటగా పండిస్తున్న పసస చెట్టుకు ఇలా 168 కాయలు కాశాయి.

వజ్రపుకొత్తూరు



ఆర్తులకు ఆప్తులు



ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తికి సహకరిస్తున్న సభ్యులు

- సమాజానికి సేవ చేస్తున్న సిక్కోలు ఉద్దాన సేవా సమితి
- నిరుపేదల కోసం ఉచిత అంబులెన్స్‌లు నడుపుతున్న వైనం
- వాట్సాప్ వేదికగా ఒక్కటై సేవల నిర్వహణ



రెండు అంబులెన్సులతో ఎస్‌వీఎస్‌ఎస్ సభ్యులు

కాశీబుగ్గ: ఎక్కడెక్కడి వారో ఒక్కటయ్యారు. వాట్సాప్ వేదికగా తమ మనోభావాలను పంచుకున్నారు. జీవితంలో చక్కగా స్థిరపడిన వారంతా తోటి వారికి సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా సేవా సమితి పెట్టి చక్కటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సుమారు 750 మంది సభ్యులు 2019 నుంచి వాట్సాప్ వేదికగా ఒక్కటై 'సిక్కోలు ఉద్దాన సేవా సమితి' పేరున అపురూపమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రక్తదానాలు, ఉచిత భోజన సరఫరా, ఆపదలో ఉన్నవారిక ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలు చేస్తూ నేడు ఇంకోమెట్టు ఎక్కి ఉచిత అంబులెన్స్ సేవలను మొదలుపెట్టారు.

సేవలు ఉచితంగానే..

ఆంధ్రా ఒడిశా బోర్డర్‌లో ఉన్న చాలా గ్రామాలకు నెట్‌వర్క్ సమస్య ఉంటుంది. ఇక్కడ ఉంటున్న వారు అంబులెన్స్‌ను కాంటాక్ట్ చేయడం చాలా సమయాల్లో కుదరడం లేదు. ఇలాంటి వారి కోసం ప్రత్యేకంగా ఒక అంబులెన్స్ ఉంటే బాగుంటుందని సేవా సమితి సభ్యులు ఉచిత అంబులెన్స్ సేవలు మొదలుపెట్టారు. ఈ సమితిలో ఆర్మీలో పనిచేస్తున్న వారు ఎక్కువగా ఉన్నారు. ఆస్పత్రుల నుంచి మృతదేహాలను నిరుపేదల ఇళ్లకు తరలించడానికి, అవసరమైన వారికి అత్యవసర సమయాల్లో ఇవ్వడానికి అంబులెన్స్‌ను చందాలు వేసుకుని మరీ సమకూర్చారు. ఇండియన్ ఆర్మీలో ఉన్న అనేక మంది సైనికులు, ఉద్యోగులు, నాయకులు, పెద్దలు, మహిళలు, యువత నెలకు ఒక్కరు రూ.100 చొప్పున చందాలు వేసుకోగా.. మరికొంతమంది భూరి విరాళాలు అందించడం, కొందరు సైనికులు నెల జీతాలను కూడా ఇవ్వడంతో రూ.50 లక్షలు సమకూరింది. ఇప్పటికే రెండు అంబులెన్సులను కొనుగోలు చేశారు. ఇంకా చాలా సేవలు చేస్తున్నారు. ఈ అంబులెన్స్‌లలో ఒక వాహనాన్ని ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, పలాస ప్రాంతాలకు కేటాయించారు. మరొకదాన్ని టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి మండలాలకు కేటాయించారు. ఏప్రిల్ 26న శ్రీకాకుళంలో రిమ్స్, కిమ్స్ వంటివాటికి అందుబాటులో ఓ అంబులెన్సును ఉంచి అక్కడి నుంచి ఈ ప్రాంతాలకు రావాల్సిన నిరుపేదల మృతదేహాలను ఉచితంగా తరలించనున్నారు.

నిరుపేదల కోసమే..



మా ఉద్దాన ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామాలకు సెల్‌సిగ్నల్ అందక ఇబ్బందులు పడుతున్నారు. 108కు సమాచారం అందని గ్రామాల్లో అనేకమంది నిరుపేదలు చనిపోయారు కూడా. అందుకే మేమంతా వాట్సాప్ గ్రూప్ పెట్టుకుని సేవ చేయడానికి సిద్ధమయ్యాం. మా జీతాలతో పాటు అనేక మంది అందించిన ఆర్థిక సహకారంతో సాయం చేస్తున్నాం. గ్రూప్ సభ్యుల సహకారంతో ఏడాదికి ఏడాది కొత్త సేవలు అందిస్తున్నాం, 2019లో రక్తదానం ప్రారంభించాం, అనంతరం ఉచిత భోజనాలు పంపిణీ, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం, నేడు అత్యవసర పరిస్థితిలో ఉన్నవారి అంబులెన్సు ప్రారంభించాం. పేదలు మృతదేహాలను తరలించడానికి వీలుగా మేం అంబులెన్స్ సమకూరుస్తాం.

– తలగాన తారకేశ్వరరావు, ఇండియన్ ఆర్మీ జవాన్, సువర్ణపురం, మందస మండలం

న్యూస్‌రీల్

ట్రాక్ సైక్లింగ్ పోటీలకు గణేష్ ఎంపిక



గణేష్

విజయనగరం: పంజాబ్ రాష్ట్రం పటియాలాలో ఈ నెల 28 నుంచి 31 వరకు జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ట్రాక్ సైక్లింగ్ పోటీలకు జిల్లాకు చెందిన డి.గణేష్ ఎంపికయ్యాడు. గణేష్‌ను సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, విజయనగరం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు అభినందించారు.

క్రెడయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చంద్రబోస్



కె.సుభాష్‌చంద్రబోస్

విజయనగరం: క్రెడయ్ చాప్టర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయనగరం జిల్లాకు చెందిన కాటూరి సుభాష్ చంద్రబోస్ ఎన్నికయ్యారు. విశాఖలో జరిగిన క్రెడయ్ చాప్టర్ రాష్ట్ర ఎన్నికల్లో 2023 – 25 సంవత్సరాలకు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటికే క్రెడయ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాలుగేళ్ల పాటు సేవలందించిన ఆయన నూతనంగా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. నిర్మాణ రంగంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానన్నారు. నిర్మాణ రంగ కార్మికులకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. బిల్డర్‌ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ముందుకు వెళతామని చెప్పారు.

డ్రిప్ ఇరిగేషన్‌తో బహుళ ప్రయోజనాలు

- ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ



డ్రిప్ ఇరిగేషన్‌ను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

విజయనగరం ఫోర్ట్: డ్రిప్ ఇరిగేషన్‌తో ప్రయోజనాలు అనేకమని ఏపీఎంఐపీ పీడీ పీఎన్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక అయ్యన్నపేట గ్రామంలో సీహెచ్ అమ్మాజీ తన కొబ్బరి తోటలో ప్రభుత్వ సహకారంతో వేసిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఆయన ఆదివారం పరిశీలించారు. కొబ్బరిలో అంతర పంటగా కర్బూజా సాగు చేసి రెండింటికి రైతు డ్రిప్ వినియోగించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఏఈఓ జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం లీగల్: జిల్లాలోని శాశ్వత లోక్ అదాలత్ (ప్లాపస్)లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టులను భర్తీ చేయడానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవల సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణ చక్రవర్తి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. తొలుత ఏడాది కాలం పాటు కాంట్రాక్టు పద్ధతిలో పని చేయడానికి, హెడ్ క్లర్క్, స్టెనో కం టైపిస్ట్, టైపిస్ట్ కం అసిస్టెంట్ ఒక్కో పోస్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో అటెండర్ కమ్ ఆఫీస్ సబార్డినేట్ 4 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు చేసే విధానం, అర్హతలు, రిజర్వేషన్, ఎంపిక విధానం తదితర ఇతర వివరాలకు కార్యాలయంలో గానీ, లేదా http://district.ecourt.gov.in/vizianagaram వెబ్‌సైట్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

కాలువలో పసికందు మృతదేహం



కాలువలో ఉన్న పసికందు మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో ఉన్న పెద్ద కాలువలో ఆదివారం ఓ పసికందు మృతదేహం లభ్యమైంది. ఆ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, వన్‌టౌన్ పోలీసులకు సమాచారమందించారు. దీంతో సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు విచారణ ప్రారంభించారు. కాలువలో ఉన్న పసికందు మృతదేహాన్ని బయటకు తీయించి, జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాస్కరరావు తెలిపారు.

అనారోగ్య శిశువుల ప్రాణాలయం

ప్రాణాపాయ స్థితిలో ఉన్న శిశువులకు అక్కడ ఊపిరి పోస్తున్నారు. ఇలా చికిత్స పొందుతున్న శిశువుల సంఖ్య నెలకు కనీసం 600 వరకు ఉంటుంది. అదే నవజాత శిశువుల విభాగం (ఎస్ఎన్‌సీయూ).

- ప్రాణాపాయ స్థితిలో శిశువులకు ఊపిరి పోస్తున్న ఎస్ఎన్‌సీయూ
- నెల రోజులలోపు పిల్లలకు ఎస్ఎన్‌సీయూలో చికిత్స
- నెలకు 600 నుంచి 700 మంది శిశువులకు చికిత్స

విజయనగరం ఫోర్ట్:

పట్టణంలోని ఘోషాస్పత్రిలో ఉన్న నవజాత శిశువుల విభాగానికి (ఎస్ఎన్‌సీయూ) వచ్చే వారంతా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారే. బాహ్య ప్రపంచం చూడకుండానే అనారోగ్యానికి గురైన నవజాత శిశువులు అక్కడ చికిత్స కోసం వస్తారు. తక్కువ బరువుతో పుట్టిన వారు, నెలలు నిండకుండానే పుట్టినవారు, పుట్టిన తరువాత శ్వాస అందని వారు, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్‌కు గురైన వారు ఇక్కడ చికిత్స కోసం చేరుతారు. ఇలా ప్రాణాపాయ స్థితిలో చేరిన వారందరిని పూర్తి ఆరోగ్యవంతులుగా చేసి ఇంటికి పంపిస్తున్నారు. అదే నవజాతి శిశువుల విభాగం. అనారోగ్య శిశువులను ఆరోగ్యవంతుగా చేసే చికిత్సాలయంగా పేరుగాంచింది. పట్టణంలోని ఘోషాస్పత్రిలో ఎస్ఎన్‌సీయూ విభాగం ఉంది. దీనికి 20 పడకలు కేటాయించారు. ఘోషాస్పత్రిలో పుట్టిన శిశువులతో పాటు సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రుల నుంచి కూడా మెరుగైన చికిత్స కోసం ఇక్కడకు వస్తారు. ఎంతో ఖరీదైన వైద్యం ఉచితంగా లభిస్తుండడంతో అధిక సంఖ్యలో రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందే రోగులకు అక్కడ వైద్య సిబ్బంది కూడా ప్రేమతో వైద్య సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నారు.

అన్ని పరికరాలు అందుబాటులో..

నవజాత శిశువుల విభాగంలో శిశువులకు వైద్యం అందించడానికి అవసరమైన పరికరాలు అన్నీ అందుబాటులో ఉన్నాయి. ఫొటోథెరపి, వెంటిలేటర్, సీపీఆఫ్, వార్మర్లు, పల్స్ ఆక్సీమీటర్లు అందుబాటులో ఉన్నాయి. ఫొటో థెరిపి పరికరంలో పచ్చ కామెర్లు ఉన్న వారికి వైద్యం అందిస్తారు. వార్మర్స్‌లో శిశువులకు వెచ్చదనం కోసం ఉపయోగిస్తారు. పల్స్ ఆక్సీమీటర్ శిశువుల పల్స్ ఎంతో ఉందో చూస్తారు. సీపీఆఫ్ మిషను ద్వారా ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉన్న వారికి చికిత్స అందిస్తారు. వెంటిలేటర్ ద్వారా ఊపిరి తీసుకోలేని వారికి చికిత్స అందిస్తారు.



ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న శిశువులు

తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు ఎక్కువ

ఎస్ఎన్‌సీయూలో బరువు తక్కువతో పుట్టిన పిల్లలకు ఎక్కువగా చికిత్స కోసం చేరుతున్నారు. ఇక్కడ బరువు తక్కువగా ఉన్న శిశువులు 40 శాతం మంది, నెలలు నిండకుండా పుట్టిన శిశువులు 35 శాతం మంది, 25 శాతం మంది ఇన్‌ఫెక్షన్స్, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడిన వారు చేరుతున్నారు. ఇన్‌పేషేంట్లుగా నెలకు 300 మంది వరకు, ఔట్ పేషేంట్ సేవలు 400 మంది వరకు పొందుతున్నారు.



శిశువుకు చికిత్స అందిస్తున్న వైద్యురాలు

శిశువులు అనారోగ్యానికి కారణాలు...

- గర్భిణుల్లో రక్తహీనత
- బాల్య వివాహాలు
- వివిధ రకాల ఇన్‌ఫెక్షన్స్
- నెలలు నిండకుండా పుట్టడం తదితర కారణాలు వల్ల శిశువులు అనారోగ్యానికి గురవ్వడం. బరువు తక్కువగా పుడుతున్నారు.

ఆరోగ్యకరమైన శిశువుల కోసం...

- మంచి పౌష్టికాహారం తీసుకోవాలి.
- రక్తహీనత లేకుండా చేసుకోవాలి.
- కిషోర బాలిక దశ నుంచి రక్తహీనత లేకుండా చూసుకోవాలి.
- తల్లులు బరువు తక్కువ లేకుండా చూసుకోవాలి.
- బాల్య వివాహాలు చేసుకోకూడదు.
- మూత్ర ఇన్‌ఫెక్షన్స్‌కు సరైన చికిత్స చేయించుకోవాలి.
- సకాలంలో వైద్య తనిఖీలు చేయించుకోవాలి.
- టీకాలు క్రమం తప్పకుండా వేసుకోవాలి.



పచ్చకామెర్లు వచ్చిన శిశువులకు ఫొటో థెరిపిలో చికిత్స

85 శాతం రికవరీ



తీవ్ర అనారోగ్యం, ప్రాణాపాయ స్థితిలో ఉన్న శిశువులు ఇక్కడ చికిత్స కోసం చేరుతారు. వారందరికి మెరుగైన వైద్య సేవలు అందించి పూర్తి ఆరోగ్యవంతులైన తర్వాత ఇంటికి పంపిస్తాం. డిశ్చార్జ్ అయిన తర్వాత ఏడాది వరకు వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తూ సేవలు అందిస్తున్నాం. 85 శాతం రికవరీ రేటు ఉంది.

– డాక్టర్ శాంతి, ఎస్ఎన్‌సీయూ, వైద్యాధికారి

సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణే ధ్యేయం

- సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ జాన్

విజయనగరం టౌన్: సీబీసీఎన్‌సీ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తే సహించేది లేదని సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆర్.ఎస్.జాన్ పేర్కొన్నారు. స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో ఆదివారం సీబీసీఎన్‌సీ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీసీఎన్‌సీ నేడు అనేక వర్గాలుగా విడిపోయి ఐక్యత కోల్పోయి సంస్థ ఔన్నత్యాన్ని నీరుగార్చే విధంగా తయారైందన్నారు. ఈ క్రమంలో విశాఖలోని హిల్‌క్రస్ట్ బంగ్లా సీబీసీఎన్‌సీ స్థలంలో ఉందని, దానికి భూమిపూజ చేసేందుకు రంగం సిద్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఆస్తుల పరిరక్షణకు పాటుపడాలని కోరారు. పాస్టర్ ఎం.అప్పలనాయుడు, జయరత్నకుమార్, టి.ఆనందరావు, టి.డేనీ పాల్గొన్నారు.

'అమృత్ జలధార' గడువు నేటితో పూర్తి

విజయనగరం పూల్‌బాగ్: అమృత్ జలధార పథకం కింద నీటి వసతులు లేని షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతుల భూములకు నీటి వసతులు కల్పించేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం చేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.సుధారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు ఖరీదు లో 50శాతం సబ్సిడీతోగానీ, రూ.50 వేలు మించకుండా ఏది తక్కువైతే అది అదనంగా సబ్సిడీ మంజూరు చేయబడుతుందన్నారు. ఈ పథకానికి 2 ఎకరాల 50 సెంట్లు భూమి ఒకరికీగానీ అంతకంటే ఎక్కువ మందికి పక్కపక్కనే భూములు ఉన్న రైతులు అర్హులని పేర్కొన్నారు. సర్ఫేస్ ఇరిగేషన్, ఇన్‌క్లూడింగ్ డ్రిప్ లేదా స్ప్రింక్లర్ ఇరిగేషన్ కింద రుణాలు పొందిన లబ్ధిదారులు మాత్రమే దీనికి అర్హులని పేర్కొన్నారు. కులం, ఆదాయం, తెలుపు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్‌బుక్ తదితర అంశాల జెరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 27లోగా తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ముస్లిం సోదరులందరికీ దావత్



దావత్‌లో ముస్లిం సోదరులకు అన్న సమారాధన

విజయనగరం టౌన్: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని కఠోర నియమ నిష్టలతో పూజలు చేసే ప్రతి ముస్లింసోదరునికి దావత్ అందించేందుకు కృషి చేస్తామని హజరత్ ఖాదర్ వలీ బాబా దర్బార్ దర్గా ముతావల్లి డాక్టర్ ఖలీల్‌బాబు పేర్కొన్నారు. దర్బార్‌లో ఆదివారం రాత్రి ముస్లిం సోదరులకు భోజనాలను సమకూర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మందికి అన్నం పెట్టే బాబా దర్బార్‌లో పవిత్ర రంజాన్ నెలలో దావత్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పౌష్టికాహారంతో హెచ్ఐవీ బాధితులకు ఆరోగ్యం

- డీఎల్ఓ రామేశ్వరి ప్రభు, డీఎల్ఓ శ్యామ్‌ప్రసాద్



పౌష్టికాహారాన్ని అందిస్తున్న రామేశ్వరి ప్రభు, శ్యామ్‌ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ బాధితులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని విజయనగరం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు, పార్వతీపురం మన్యం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. స్థానిక విజయ పాజిటివ్ నెట్‌వర్క్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధిత పిల్లలకు పౌష్టికాహార కిట్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని కోరారు. హెచ్ఐవీ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా వాడుతూ మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా జీవితకాలాన్ని పెంచుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో విజయ నెట్‌వర్క్ సంస్థ ప్రతినిధులు చౌదరి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్లతో మత్స్య సంపద అభివృద్ధి



సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న ఫారెస్టు అధికారులు వెంకటేష్, అప్పలరాజు తదితరులు

పూసపాటిరేగ : తాబేళ్లు మత్స్య సంపద అభివృద్ధికి దోహదం చేస్తాయని జిల్లా ఫారెస్టు రేంజ్ అధికారి ఎస్.వెంకటేష్ అన్నారు. మండలంలోని తిప్పలవలస తీరంలో ట్రీ ఫౌండేషన్, అటవీ శాఖ ఆధ్వర్యంలో 256 తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి ఆదివారం ఆయన విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాబేళ్లు మత్స్యసంపద వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ ఏడాది 22,576 తాబేళ్ల గుడ్లను సేకరించడం జరిగిందని చెప్పారు. తీరంలో 10 హేచరీస్ ద్వారా తాబేళ్ల గుడ్లు ద్వార్లా పిల్లలను ఉత్పత్తి చేసి సముద్రంలోకి విడిచిపెడుతున్నామని తెలిపారు. సముద్ర తాబేళ్ల సంరక్షణ వల్ల వాతావరణం సమతుల్యం చెంది మత్స్య సంపద పెరుగుతుందని పేర్కొన్నారు. సముద్ర తాబేళ్లను పర్యావరణ నేస్తాలుగా చెప్పొచ్చన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా డీఎఫ్ఓ ప్రసన్న, ఫారెస్టు సెక్షన్ అధికారి పి.అప్పలరాజు, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ బి.కామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్

జామి: జామి గ్రామానికి చెందిన పి.ప్రసాద్, పి.మహలక్ష్మిలకు ఎస్.కోట న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్ వెంకటరమణ విధులకు ఆటంకం కలిగించినట్లు ప్రసాద్, మహాలక్ష్మిలపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమండ్ విధించినట్లు ఎస్సై చెప్పారు.

ఆటో, బైక్ ఢీ: యువకుడి మృతి

గుర్ల: మండలంలోని కెల్ల రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కెల్ల గ్రామానికి చెందిన తుపాకుల సాయి (15) మృతి చెందాడు. తుపాకుల సాయి కెల్ల నుంచి ద్విచక్ర వాహనంపై గుర్ల వస్తుండగా రెల్లిపేట వద్ద ఆటో ఢీకొట్టడంతో రోడుపై పడి అక్కడిక్కడే మృతి చెందాడు. కెల్ల హైస్కూల్‌లో సాయి పదవ తరగతి చదువుతున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎస్ఐ శిరీష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మాహత్యాయత్నం



చికిత్స పొందుతున్న అచ్యుతరావు

పార్వతీపురం: భార్య గొడవపడి కన్నవారింటికి పిల్లలతో కలిసి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన భర్త బ్లేడుతో కోసుకుని ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన రొక్కం అచ్యుతరావు భార్య అరుణ గొడవపడి పిల్లలతో కలిసి నెలరోజుల క్రితం కన్నవారి ఊరు కొప్పర కొత్తవలస గ్రామానికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై బ్లేడుతో మెడ, చేతులమీద కోసుకున్నాడు. ఈ విషయం గమనించిన స్థానికులు 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

పురుగుమందు తాగి అస్వస్థత

పార్వతీపురం: కూల్ డ్రింక్ అనుకుని పొరపాటున పురుగుమందు తాగడంతో ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగి గ్రామానికి చెందిన బిడ్డిక పాపారావు జీడితోటలో పనిచేసుకుంటుండగా భార్య స్వర్ణ జీడితోటకు కొట్టేందుకు పురుగుమందు బాటిల్స్ తెచ్చింది. అయితే అవి కూల్‌డ్రింక్ బాటిల్ అనుకుని పాపారావు పొరపాటున తాగాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య కుటుంబసభ్యుల సహకారంతో చికిత్సకోసం జీఎల్ పురం ప్రభుత్వ ఆస్పత్రికి భర్తను తరలించింది. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించిన తరువాత మెరుగైన వైద్యంకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

పనస పసందు



వజ్రపుకొత్తూరు: పనస రైతుల పంట పండింది. పనస కాయలు గుత్తులు గుత్తులుగా కాయడంతో పాటు మంచి ధర కూడా లభిస్తోంది. ఉద్దానం గోపినాథపురంలోని రైతు కర్ని వల్లయ్య కొబ్బరి తోటలో అంతర పంటగా పండిస్తున్న పనస చెట్టుకు ఇలా 168 కాయలు కాశాయి.

బరువులెత్తి..పరువు పెంచి..!

- బంగారు, వెండి పతకాలు సాధించిన జిల్లా లిఫ్టర్లు



బంగారు, వెండి పతకాలను చూపిస్తున్న శనపతి పల్లవి



వెండి పతకాన్ని చూపిస్తున్న బి చంద్రిక

నెల్లిమర్ల రూరల్: బెంగళూరు వేదికగా ఈ నెల 24 నుంచి 29 వరకు జరుగుతున్న 4వ ఖేలో ఇండియా యూత్, జూనియర్, సీనియర్ జాతీయ ర్యాంకింగ్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన శనపతి పల్లవి(జూనియర్–64కేజీల విభాగం) బంగారు పతకాన్ని సొంతం చేసుకోగా, సీనియర్ విభాగంలో వెండి పతకాన్ని సాధించింది. నెల్లిమర్ల పట్టణానికి చెందిన బి చంద్రిక(సీనియర్–55 కేజీల విభాగంలో) వెండి పతకం దక్కించుకుంది. జాతీయస్థాయి వేదికపై సత్తా చాటిన క్రీడాకారులను వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు బీఎస్ఆర్ మూర్తి, లక్ష్మి, కోచ్ చల్లా రాము తదితరులు అభినందనలు తెలిపారు.

డ్రాయింగ్ మాస్టారుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



డ్రాయింగ్ మాస్టారు చినసత్యనారాయణకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందచేస్తున్న సెర్ప్ డైరెక్టర్ ఇంతియాజ్ తదితరులు

పూసపాటిరేగ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఇనపకుర్తి చిన సత్యనారాయణకు జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చింది. విజయవాడకు చెందిన డ్రీమ్ చిల్డ్రన్ యూత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అక్కడి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ గీసిన చిత్రానికి జాతీయస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ఈ సందర్భంగా రాష్ట్ర సెర్ప్ డైరెక్టర్ ఎంఎం ఇంతియాజ్ చేతుల మీదుగా ఆయన అవార్డు తీసుకున్నారు.ఉత్తమ అవార్డు వచ్చినందుకు పాఠశాల హెచ్‌ఎం శంకర్రావుతో పాటు ఇతర ఉపాధ్యాయులు డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జామ్స్ డైరెక్టర్ దేవానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ సేవాసంఘం కార్యవర్గ సమావేశం



పైడితల్లి అమ్మవారి చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేస్తున్న నాలుగెస్సుల రాజు, తదితరులు

విజయనగరం టౌన్: శ్రీ పైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం 25వ వార్షికోత్సవం 23, 24, 25 తేదీల్లో ఘనంగా నిర్వహించడానికి నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో స్థానిక నర్తనశాల అకాడమీలో ఆదివారం అమ్మవారి చిత్రపటానికి పూలమాలలేసి, జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు నాలుగెస్సుల రాజు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని కోరుకున్నారు. సంస్థ వార్షికోత్సవానికి సభ్యులందరూ పూర్తి స్థాయిలో కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజు, ఎస్.అచ్చిరెడ్డి, బంగార నాగప్రకాశ్, పీవీపీవీఎస్.భానురాజా, కొమ్ము కనకారావ్, భేరి రాధికారాణి, సామవేదుల గీతారాణి సిస్టర్స్, తాడి వీర్రాజు, స్వప్న హైందవి తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- విభిన్న ప్రతిభావంతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయడానికి కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగుల) నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు చేపట్టినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన నాటికి అభ్యర్థి వయసుంస ఒకటి జూలై 2023 నాటికి 18 సంవత్సరాలు నిండి ఉండాలి. గరిష్ట వయసు 52 సంవత్సరాలు దాట కూడదు. అర్హులైన విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో గల విభిన్న ప్రతిభావంతులు/వయోవృద్ధుల సంక్షేమ శాఖ, రూమ్ నంబర్ 34, కలెక్టరేట్, విజయనగరం' అనే అడ్రస్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ స్వయంగా గానీ అందజేయాలని స్పష్టం చేశారు.

పోస్టుల వివరాలిలా..

గ్రూప్–4 (డీఎస్సీ) పోస్టులు: జూనియర్ సహాయకులు–3. వాటిలో బధిరులకు (చెముడు) జనరల్ కోటా–1, చలన సంబంధం (ఓహెచ్) జనరల్–2 ఉన్నాయి. క్లాస్–4 ఇతర కేటగిరీలకు చెందిన పోస్టులు: ఆఫీస్ సబార్డినేట్ (చలన సంబంధం)–1 (జనరల్ కోటా), నైట్ వాచ్‌మన్: దృష్టి లోపం (అంధులకు)–1 (జనరల్ కోటా), బధిరులు (మూగ చెముడు)–1 (జనరల్ కోటా), దోబీ/చెక్లర్/స్వీపర్: బధిరులు (మూగ చెముడు)– 1(మహిళ కోటా), ఏఎన్ఎం: బధిరులు (మూగ చెముడు) –1 (మహిళ) మొత్తం 8 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జీవీబీజగదీష్ తెలిపారు. పూర్తి నోటిఫికేషన్, దరఖాస్తు నమూనా కోసం 'విజయనగరం.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. పూర్తి సమాచారం/సందేహ నివృత్తి కోసం ఫోన్ నంబర్ 08922-274647లో సంప్రదించాలని తెలియజేశారు.